శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి



శ్రీ దత్తాస్వామి

శ్రమతో సేవ - సేవతో కైవల్యం

వ్యవస్థాపకులు: శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్   ఎడిటర్స్ : VAS ప్రసాద్, గొర్తి సాయి సుబ్రహ్మణ్యం

శ్రీ సుబ్బరామయ్య సార్ జీవిత విధానం ద్వారా బోధించిన "శ్రమతో సేవ - సేవతో కైవల్యం" ను అనుసరించి మా జన్మలు ధన్యం గావించుటకు ఈ మాసపత్రికను ప్రారంభిస్తున్నాము. శ్రీ సుబ్బరామయ్య సార్ మనకందించిన అనుభవాలను, సాంగత్య స్మృతులను, సార్ ఆచరించి బోధించిన అమూల్య విషయాలను స్మరించుకొనుటకు, మహాత్ములు బోధించిన సత్సంగ, సద్గ్రంథ పఠనలకు ప్రేరణగా ఈ మా చిన్న సేవ.

గమనిక : ఎవరైనా ఈ మాగజైన్ లో తమ వ్యాసాలను, అనుభవాలను పంచుకోదలిచినవారు saimaster.sevatrust@gmail.com కు e-mail చేయగలరు

సంపుటి : 08

సంచిక : 09

ఫాల్గుణ పౌర్ణమి

14 March 2025

నేపథ్యం:

చేయుదమా పంచారతి - వెంకయ్యస్వామికి ఆరతి

పూజ్యశ్రీ సుబ్బరామయ్య సార్ ప్రవచనం	గురుని విశ్వం లో దర్శిస్తూ అనంతమైన పదసేవ శ్రీ ఎక్కిరాల అనంతాచార్యులు గారు ఎలా చేసారో, ఎలా చేయాలో ఉదాహరణలతో సార్ చెబుతున్న ప్రవచనం Ananthamaina Pada Seva

శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

పంచేంద్రియ ఖలులు మదిలోన దూరుచో మదిని నీవుందవో అరుణాచలా

→ ఈ ఐదు ఇంద్రియాల దోషాలు నా మనస్సులోకి ప్రవేశించినా, నీవు నా మనస్సులో నిలిచి ఉంటావా, అరుణాచలా?

ఒకడవౌ నిను మాయ మొనరించి వచ్చువారెవరిది నీ జాలము అరుణాచలా

→ నిన్ను మాత్రమే శరణుగా భావించి, మాయ నుండి బయటపడిన భక్తులకు మాత్రమే నీ కృప లభిస్తుందా, అరుణాచలా?

విషయ సూచిక

సంపాదకీయం.. **4**

భక్తుల అనుభవాలు.. **9**

సార్ సత్సంగం (ప్రసాద్ డైరీ)... **13**

శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు.. **15**

సాయి సుబ్రహ్మణ్యంకి : చెడ్డ లక్షణాలు పోగొట్టుకోవటానికి ఏ ప్రయత్నం ఎలా చేయాలో. **15**

20-12-1999 న సాయి శివకి: నిష్కామకర్మ ఎలా చేయాలో శ్రీ అనంతాచార్యుల వారి జీవితం చూసి నేర్చుకోవలసినవి.. **22**

08-09-2005 న లక్ష్మక్క గారికి, సాయి కి: ఇంద్రియలోలత లేకుండా శరీర అవసరాలను తీరుస్తుండాలి.. **28**

సార్ సత్సంగం.. **29**

మహాత్ముల వాక్యాలు... **31**

సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్

శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాష్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దర్గాస్వామి

సంపాదకీయం

ఓం సాయిరాం

చేయుదమా పంచారతి - వెంకయ్య స్వామికి ఆరతి |
లే లెండు బంధువులారా - లేచెను రమానాథుడు ||

స్థిరమైన మనస్సుతో - చేయుదమా ధ్యానం |
కృష్ణనాధా దత్త స్వామి - మా మదిలో నీవే నోయీ ||

పంచారతి - పంచేంద్రియములు సద్గురు సేవకు అర్పించుటకు గుర్తుగా, "శ్రమతో సేవ" కు వివరణగా తలచవచ్చు. అలా అర్పించుటకు శ్రీ మాష్టారు నడచుకున్నట్లు "త్వమేవ మాతాచ - పితా త్వమేవ, త్వమేవ బంధుశ్చ - సఖా త్వమేవ, త్వమేవ విద్యా - ద్రవిణం త్వమేవ, త్వమేవ సర్వం - మమ దేవ, దేవా!" అన్న **శరణాగతి** భావం స్థిరపడడం ఒక్కటే మార్గం. దానికి "**కర్మ సుకౌశలము - భావశుద్ధి** అను మానవజాతిని పరమాత్మ వద్దకు చేర్చగల రథచక్రాలపై **హాత్ దరూన్ చలాల్** చేసి నడవాలి" అని శ్రీ సార్, "శ్రీ మాష్టారి భోధామృతం" లో చెబుతారు. ఈ ఆచరణ సౌలభ్యమునకు విశ్వరూపుడైన సద్గురువే మన చుట్టూ ఉండే పరిస్థితులు, వ్యక్తులు,

సంఘటనల రూపంలో ఉన్నారు అన్న ఎరుకతో మన "ఇష్టాయిష్టాలను" ధర్మాచరణ, సద్గురు సేవ దిశలో త్యాగము చేస్తూ నడచుకోవటం ఉత్తమ మార్గము అని శ్రీ మాష్టారు - సార్ ల రచనలు, జీవిత విధానములు తెలుపుతాయి.

ఉదాహరణకు శ్రీ మాష్టారు తమ ఇష్టాయిష్టాలకు భిన్నంగా దైవాదేశాన్ని స్వీకరించటం - శరణాగతి చేయటాన్ని గృహస్థాశ్రమ స్వీకరణ, విద్యానగర్ నుండి ఒంగోలు ఆగమనము, మొ|| ఎన్నో సంఘటనలలో చూడవచ్చు. అట్లే శ్రీ సుబ్బరామయ్య సార్ కలిచేడులో మిద్దె ఇల్లు నిర్మించుకొని కూడా గొలగమూడి నివాసము, శేషయ్య ఆరోగ్యం విషయమై సద్గురు సందేశాన్ని ప్రీతి-విశ్వాసముతో ఆచరించటం, voluntary రిటైర్మెంట్ ఇవ్వటం, శ్రీస్వామి మందిరంలో పూజ విరమించుకోవటం, స్వామి ఆశ్రమ కమిటీలో ఉండటం, అవధూత లీల రచన మొ|| ఎన్నో సంఘటనలలో ఇష్టాయిష్టాలకు అతీతంగా సద్గురు ప్రసాదంగా స్వీకరించారు. అలా జీవితంలోని ప్రతి సంఘటనలో సద్గురు కర్తృత్వాన్ని మాత్రమే దర్శిస్తూ, సద్గురు అనుగ్రహంగా స్వీకరించిన వీరు మహాత్ములుగా "మృత్యువుపై ఘన విజయం" తో సద్గురు తో అభిన్నులుగా నిలవటం మన అందరి అనుభవాలలో చూడవచ్చు.

అలా శరణాగతి ఏర్పడినప్పుడు మాత్రమే **"స్వజన-ఆప్తవ-బాంధవాన్, ఆత్మధారాధికం సర్వం, సద్గురుభ్యో నివేదయేత్"** అన్న వాక్యం ఆచరణలోకి వస్తుంది. "తను" అనబడే సర్వస్వము, సద్గురు సన్నిధిన రమించుటకు మాత్రమే ఇచ్చ చూపుతుంది. శ్రీ మాష్టారు ఉదయ ప్రార్ధనలో వివరించిన రీతిన "నే చేయు కార్యంబులన్నియు, నీ సేవలే అగుగాక", "నా తలంపులన్నియు నిన్ను తలంచుటే అగుగాక", "నా పలుకులన్నియు నీ స్తోత్రములే అగుగాక" అన్నట్లు మన వాక్కు, ఆలోచన, క్రియలు అన్ని సద్గురు స్మరణ, ఎరుకతో, సద్గురు సర్వవ్యాపక, కర్తృత్వాల గుర్తుతో మలచుకొన్న కొద్దీ సద్గురునికి నిజంగా పంచారతి చేసిన వాళ్ళము అవుతాము. అప్పుడు సద్గురువు మన మనసులో, హృదయంలో స్థిరనివాసం ఏర్పరుచుకుని, మనల్ని తగురీతి ప్రేరేపించి ధర్మమార్గంలో తప్పక నడిపిస్తారు. అట్టి సద్గురు "నిరంతర స్మరణ" ధ్యానం అవుతుంది. మన మదిలో నుండి సద్గురువే పలుకుతూ ఆయన మాటను మనం వినగలిగే ఎరుక ప్రసాదిస్తారు. నిరంతర సద్గురు స్మరణ, అనన్య చింతన వల్ల మన

పాపము, కర్మబంధాలు దగ్ధమై సద్గురువే అన్ని రూపాలలో అంతట దర్శనమిస్తారు.

ఇట్టి పరివర్తనకు మూలం పంచారతి - అనగా పంచేద్రియలను, వాని గ్రహణ కు మూలమైన మనస్సును సద్గురు పరం చేయటమైతే, దానికి సరళ మైన మార్గము, మార్గ దర్శనము కుడా మనము ఈ మహాత్ముల జీవనము, వాక్యములలోనే చూడగలము. శ్రీ మాష్టారు తరచూ వేసే ప్రశ్న "భగవంతుడు మన నుంచి కోరేది ఏమిటి ?"

సమాధానం : "కాలము - మనస్సు" !

పంచేంద్రియ వ్యవహారములు సద్గురు పరం చేయుటకు కాలము, నిర్ణీత కాలము సమర్పించటం తప్పనిసరి. అదే ప్రథమ మెట్టు - సులభ - ముఖ్య మార్గము అని శ్రీ మాష్టారు, శ్రీ సార్ ల ఉవాచ. అలా కాలము నియమానుసారం సమర్పించిన వారి మనస్సు హరిస్తారని, ఎంతటి ప్రయత్నముతో కూడా కట్టుబడని పంచేంద్రియ వ్యాపారములు - సద్గురు పరం చేయుటకు మార్గం దొరుకుతుంది అని శ్రీ సుబ్బరామయ్య సార్ జీవనముతో సహా ఎందరో సద్గురు భక్తుల జీవనము లో చూడగలము. "పాండురంగ విజయం" అంతా దానికి ఉదాహరణే అని, ఇలా పట్టుపట్టి నలభై రోజులైనా కూర్చుంటే అది సహజము అవుతుంది అని శ్రీ భరద్వాజ మాష్టారు సూచించటం "ధ్యానయోగ సర్వస్వము" లోను, "మహాత్ముల

ముద్దుబిడ్డడు” లోను చూడవచ్చు. అలా సమయము నియమముగా సద్గురు స్మరణ, (నిష్కామ) సేవకు సమర్పించటం - నిష్ఠ సబూరి లోని ప్రధమ పాఠంగా శ్రీ మాష్టారు, సార్ చెబుతూ దానికి (ఇష్టా-అయిష్ట) త్యాగము తప్పనిసరి అని “మాష్టారి మంచిమాట” లో చెబుతారు. అలా నియమపాలనతో మొదలిడితేనే సద్గురువు క్రమంగా మన “పంచేంద్రియ-వ్యాపార ఆరతి” చేయించి, కఠోర నియమపాలన వైపు నడిపించి, మన మనస్సును హరించి, “స్థిరమైన ధ్యానము” సిద్ధింప చేసి, “మా మదిలో నీవే నోయీ” అను రీతి తిష్ట వేస్తారు. ఇలా ఒక్క అడుగు సమర్పించు సిద్ధమైన వారికి వామనుని వలే సర్వం ఆక్రమించి “సర్వం మమ దేవ దేవా”, “సర్వ ధర్మాన్ - పరిత్యజ్య - మామేకం శరణం వ్రజ” అనునవి అనుభవింప చేస్తారు. ఇలా మనమొక్కరమే చేయటము గాక సామూహికంగా ప్రయత్నం చేస్తూ ఉండాలి. అంటే సత్సంగములు, ఆరతులు నిర్దిష్ట సమయంలో చేయటము, ఏ ఆడంబరము లేకుండా సంఘ సేవ చేయటము మొదలైనవి తప్పకుండా ప్రయత్నం చేయాలి. అలా మనందరినీ ఆ దిశలో అడుగులు వేయించమని, హృదయపూర్వకంగా ఈ హారతి పాటతో మనసు కలుపుతూ ప్రార్థిద్దాము.

శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దత్తాస్వామి

భక్తుల అనుభవాలు

గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి సమాధి మందిర పూజారి శాస్త్రి గారు ఇలా చెప్తున్నారు: నేను గొలగమూడికి రాక ముందర ఒక విషయంలో భగవంతుని మహిమను మనస్సులో శంకించినందున తీవ్ర పశ్చాత్తాపంతో బాధపడ్డాను. దానికి శిక్షగా ఏమి వేసుకోవాలి అని అనుకుంటుంటే మనం సామాన్యంగా తప్పు చేసిన వారిని "అన్నం తింటున్నావా గడ్డి తింటున్నావా" అని అరుస్తాము కదా అందువల్ల నేను ఇక మీదట జన్మలో అన్నం తినను అని అనుకున్నాను. మొదట్లో ఆలా చేసేటప్పుడు కొంత శరీరం తగ్గింది. అది చూసిన స్నేహితులు, తెలిసినవారు కారణం తెలుసుకొని అన్నం తినకపోతే రోగాన పడతారు లేదా చనిపోతారు అని చెప్పారు. అందువలన ఆ నియమం పాటించలేక పోయాను. తరువాత గొలగమూడి వచ్చాను. నేను ఒక్కడినే ఉండి నియమం పాటిస్తున్నాను. అలా కొన్ని సంవత్సరాలు ఆ నియమం పాటించాను. గొలగమూడి లో చాలామందికి ఈ విషయం తెలుసు. అలా

హాయిగా నియమం పాటిస్తుండగా, నా విషయం తెలిసిన వారు “అన్నం తినకపోతే ఆరోగ్యం పాడవుతుంది” అని మళ్ళీ అనే సరికి ఒక రకంగా భయం, ఆందోళన కలిగాయి. ఎంతమందితో మాట్లాడినా, ఎంత ఆలోచించినా నా ఆందోళన తగ్గలేదు. ఒకరోజు వెంకయ్య స్వామితో ఈ రోజు ఎలాగైనా సరే మీరే ఈ సమస్యకు పరిష్కారం చెప్పాలి అని ప్రార్థించాను. ప్రతిరోజు రాత్రి మందిరం మూసిన వెంటనే నేను నా ఇంటికి వెళ్ళిపోతాను. కానీ ఆ రోజు మందిరం మూసినా కొంతసేపటి దాకా నేను మందిరం లో ఉన్నాను. మందిరం బయటకు వచ్చేసరికి మందిరం బయట అమ్మగారు (శ్రీ సుబ్బరామయ్య సార్ గారి ధర్మపత్ని శేషమ్మ గారు), వాళ్ళబ్బాయి శేషయ్య ప్రతిరోజూ లాగా వెంకయ్య స్వామి సమాధి మందిర దర్శనానికి వచ్చి బయట నుంచే నమస్కారం చేసుకుని ఉన్నారు. నన్ను చూచి నా విషయం తెలిసిన అమ్మగారు తమంతట తామే “మీరు యింకా అన్నం తింటున్నారా లేదా?” అని నన్ను అడిగారు. నేను నాకు వచ్చిన అనుమానం శేషమ్మ గారికి చెప్పాను. అమ్మగారు తడుముకోకుండా “ఎంతమంది లేరు? షుగర్ పేషెంట్స్ అన్నం తినకుండా ఉంటున్నారు. అన్నం తినకపోతే చచ్చేటట్లయితే షుగర్ పేషెంట్స్ అందరూ చనిపోయి ఉండాలి. అన్నం తినకపోతే ఏమీ అవదు. మీరు భగవంతుని కోసం

పెట్టుకున్న నియమం పాటించండి” అని చెప్పారు. ఆ మాట విని నాకు ఎంతో ధైర్యం వచ్చింది, ఆనందం కలిగింది. శ్రీ వెంకయ్య స్వామికి చెప్పుకుంటే అమ్మగారి ద్వారా సమాధానం ఇచ్చారు. అప్పటినుండి స్వామి దయ వలన నియమ పాలన జరుగుతోంది. నేను ఆరోగ్యంగా ఉన్నాను.

శిరీష (సాయి సుబ్రహ్మణ్యం భార్య) తనకు శ్రీ సార్ తో గల అనుభవాన్ని ఇలా చెబుతోంది:

పెళ్లి అయిన మొట్ట మొదటనే గొలగమూడిలో నివాసం ఉండేటప్పుడు అక్కడి పల్లెటూరు వాతావరణం, పరిస్థితి - నా పూర్వ విధానానికి పూర్తి భిన్నంగా ఉండటం వల్ల చాల భాధగా ఉండేది. ఆ విషయం ఒకసారి సార్ తో మా ఆయన చెప్పినప్పుడు **ఇక్కడే భాదపడుతూ ఉండటం ఎందుకు? స్వామికి కాలం ఇమ్మను** అన్నారు. అప్పటి నుండి గొలగమూడి స్వామి మందిరంలో రోజూ 10-12 గం||ల తర్వాత సాయి మాష్టర్ నిలయంలో ఆరతులలో పాల్గొనటంతో గడిపే దాన్ని. కొద్ది రోజుల్లో నేను ఉహించని విధంగా, ప్రత్యేకంగా అడగకుండానే సార్ మా ఆయనకు “Post-doctorate” చేసి రమ్మనటం, అట్లే “వెంకయ్య స్వామి అనుకుంటే వారంలో రాదా” అని “Post-doctorate” వచ్చేలా చేసి France పంపటం జరిగింది. స్వామి వీసా అప్లికేషను ఒకే రోజులో

చేయటం మొదలుకొని పిలిస్తే పలుకుతుండటం తో శ్రీ సార్ పై కూడా ఎంతో పూజ్య భావము - ఏ విషయం అయినా మా ఆయన ఫోన్ చేసినప్పుడు చెప్పుకోవటం ఉండేది.

డెలివరి - డాక్టర్ భయంతో నార్మల్ డెలివరీ అయ్యేట్లు చూడమని సార్ కు విన్నవించుకున్నప్పుడు సార్ రోజు ఆరతులు చేయమన్నారు. అలాగే చేస్తూ రాజమండ్రి కి వెళ్ళాక అక్కడ మాటల్లో పడి బాబాకు మాలలు కట్టే దాన్ని. అది బాబా సేవే కదా ! అని సరి పెట్టుకుంటే, మా ఆయన సార్ తో నా డెలివరి విషయం ప్రస్తావించినప్పుడు సార్ మాట్లాడుతూ **మాలలు కట్టేది కాదు, హృదయ పూర్వక నామ స్మరణ తో కాలం ఇమ్మను** అన్నారు. నేను మాట్లాడుతూ మాలలు కట్టే విషయం మా ఆయనకైనా చెప్పకనే శ్రీ సార్ ఇలా చెప్పటం ఆశ్చర్యం వేసింది. ఇలా నాచే కాలము సమర్పించేటట్లు మరల-మరల చేసారు. ఇద్దరు పిల్లల విషయంలో నార్మల్ డేలివరీ లు కావటమే కాక, శ్రీ స్వామి మీద విశ్వాసం ఎంతో పెంచి ఇప్పటికి ప్రతి విషయానికి స్వామిపై ఆధారపదేట్లు నడిపిస్తున్నారు. మా కుటుంబాన్ని అడుగడుగునా నడిపిస్తున్న స్వామికి, సార్ కు శతకోటి కృతజ్ఞతలు.

సార్ సత్సంగం (ప్రసాద్ డైరీ)

12-Feb- 2005

1. గురువును ఎలా సేవించుకోవాలి? ఇష్టము అయిష్టములను తొలగించుకోవడమే ముఖ్యము.
2. ఫలితము ఏమైనా బాధపడకుండా ఉండటమే ముఖ్య లక్ష్యము. మనది ఏదైనా నష్టపోయినా బాధపడకుండా ఉండటము. 10,000 రూపాయలు పోయాయి. అదే నాలుగు సార్లు హాస్పిటల్ కి వెళ్ళకుండా అలా చేస్తున్నారు అని నమ్మి ఉండటం.
3. స్వామి దగ్గరికి వస్తుంటే ముందర కష్టాలు అడ్డంకులు పెట్టి ఏదో తీవ్రంగా ఉండే కర్మను తీసేస్తారు. ఉదాహరణకు
    a. దమ్మపేట నాగేశ్వరరావు మాస్టర్ గారు గొలగమూడికి బైక్ లో వస్తూ ఉంటే బైక్ కి పంక్చర్ అవటం
    b. శ్రీ గురు చరిత్రలో సావిత్రి దత్తుడు యొక్క ఆఖ్యానం. అందరూ వ్యతిరేకంగా మాట్లాడుతూ ఉన్నా, ఒక స్వామి రూపంలో రుద్రాక్షలు పెట్టడం జరుగుతున్నా సావిత్రి శ్రీ

గురుని దర్శనం తర్వాతనే మిగిలిన కార్యక్రమం అని ఆయన దర్శనానికి వెళితే శ్రీ గురుడు దత్తుని తిరిగి బ్రతికిస్తాడు.

12-Oct-2005

1. విశ్వమంతా సాయి రూపమనే భావన అలవాటు అవ్వాలి. కుక్కకు పెట్టినా, బిచ్చగాళ్లకు పెట్టినా ఆ రూపంలో ఉన్న పరమాత్మకే నివేదిస్తున్నామనే భావన ప్రధానంగా ఉండాలి.

13 అక్టోబర్ 2005 రాత్రి 8:40 pm:

2. సద్గురువు చేతిలోకి వచ్చిన తర్వాత ఆయనే మమకార బంధాలను తీసేస్తూ కొత్తవి తెగులుకోకుండా రక్షిస్తారు.

14 అక్టోబర్ 2005:

1. సాధన నువ్వు ప్రొలాంగ్ (పొడిగిస్తూ) చేస్తే లేట్ అవుతుంది. అదే ఫాస్ట్ గా చేస్తే త్వరగా అయిపోతుంది.
2. దుఃఖ దోష దర్శనం చేస్తే అప్పుడు లక్ష్యం మీద శ్రద్ధ ప్రీతి ఏర్పడతాయి.
3. ఇష్టాయిష్టాలను త్యజించడమే సాధన.
4. అనన్యా చింతయంతో మాం: అన్య చింతలు లేకుండా ఈ కాలంలో ఉండగలమా అంటే భరద్వాజ మాస్టారు “ఉండొచ్చు” అని బల్ల గుద్ది

చెప్పారు. **మనం ఎవరితో మాట్లాడుతున్నా సాయిబాబా అనే స్పృహతో చేస్తే సరి.**

5. కష్టమైనా ఇష్టంగా చెయ్యాలి.
6. ఏడుస్తూ చేసేది అదే పని. సంతోషంగా చేసేది అదే పని. అందువలన ఏడుపు ఎందుకు? సంతోషంగా చేస్తే పోలా?
7. ఇష్టాయిష్టాలను త్యజించడమే సాధన. సాయి త్వరగా Phd అయ్యేటట్లు చూడండి సార్ అంటే సార్ చెప్పినది "ముందర వీటిని (ఇష్టాయిష్టాలను) త్యజించాలి". భయమనేది ఇష్టం వలన వస్తుంది.
8. అనుభవం వచ్చేదాకా అడగవచ్చు. అనుభవం వచ్చిన తర్వాత అడగకూడదు.
9. లంఖణం పరమ ఔషధం అని రెండు మూడు సార్లు చెప్పారు.

శ్రీ సుబ్బరామయ్య సార్ లెటర్లు

<u>సాయి సుబ్రహ్మణ్యంకి : చెడ్డ లక్షణాలు పోగొట్టుకోవటానికి ఏ ప్రయత్నం ఎలా చేయాలో</u>

శ్రీ సాయినాథాయ నమః

ఓం

గొలగమూడి

శ్రీ షిర్డీ సాయిబాబా

శ్రీ భరద్వాజ మాస్టర్

శ్రీ సుబ్బరామయ్య గారు

శ్రీ వెంకయ్యస్వామి


శ్రీ దగ్గాస్వామి

Dear Sai!

"ఒక్క చెడ్డ లక్షణం మిగిలి ఉన్నా మిగిలిన అన్నింటినీ ప్రజ్వలింప చేస్తుందని, వాటిని తొలగించు కోవటానికి చేసే ప్రయత్నం దానికి అడుగడుగునా ఆయన సహకారం అలా అలా ఇంకా ఉధృతం కావటం ఎందుకు సాధ్యం కావటం లేదు ?" అని వ్రాశావు.

నిత్యం శరీర వ్యాయామం అవసరం. అవసరమంటే పహిల్వానులా కసరత్తు వంటిదని తలచకు. **సూర్య నమస్కారాల వంటివి తప్పనిసరిగా ఉండాలి**. మాస్టారు చేయలేదు అని చెప్పవద్దు. వారు సాయి వద్ద సమాధి స్థితి పొందక ముందు వ్యాయామం చేసారు. Ph.D. వారికి చక్కగా వివరించే కుశలత లేదు. అవసరం అని మాత్రం గట్టిగా చెప్పగలను. అది అనుభవం నేర్పిన పాఠం.

Job నుండి 6.30 గంటలకు వస్తే తిరిగి 9 గంటల వరకు గుడి, Mess, సరుకులు, ఏదో తిరుగుతూ 2½ గంటలూ పాడు చేసు కోవడమేనా?

మన కళ్ళ గుండా, చెవుల గుండా, స్పర్శ ద్వారా, శ్వాస ద్వారా ఎంత లౌకికం మనకు చుట్టుకుంటుందో బాగా యోచించు. నిన్నునీవు సంఘంలోని ఇతరులతో పోల్చుకుంటే ఇక ఎప్పటికైనా వాళ్ళ లౌకిక స్థాయి నుండి బయట పడలేవు. సరుకులు మనిషి ద్వారా తెప్పించుకుని నీ వంట నీవు తిను. సర్వం సమకూడుతుంది. కొత్త రకం Instrument వచ్చింది.

అన్నం, కూర రెండు గిన్నెలలో పెట్టి తగిన నీళ్ళు పోసి స్విచ్ వేసి వదిలేస్తే ఉడకగానే అదే auto systesm ప్రకారం ఆరిపోతుంది. మరొక బటన్ on అయి కొద్ది పాటి వేడి ఉండి, మనం ఎప్పుడు తిన్నా వేడిగా ఉంటుంది. రుచులు పాకాలుగా తినడం తగదు. **శరీరానికి శక్తే కానీ, రుచికి తినరాదు**. **Food విషయం జాగ్రత్త. అప్పుడు మన సాధన ఉధృతం అవుతుంది. Practical గా చేసి చూడు**.

ఇంద్రియాణాంహి చరతాం యన్మనోను విధీయతే
తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నవ మివాంబసి

అన్నారు గీతలో. **ఇంద్రియములలో చరించు మనస్సు యొక్క ప్రజ్ఞ హరించబడును. ఎలాగు? పడవ యొక్క వేగము గాలి చేత హరింప బడినట్లు.**

మామిడి పండు మానేస్తాను. స్వీటు మానేస్తాను అని లోపల చివుక్కు మంటూ వదలటం కాదు. ఆకలికి మందుగా భగవంతుడు ఇచ్చింది ఆయన ప్రసాదంగా తినాలి.

ఆహారానికి హృదయపూర్వకంగా నమస్కరించి ఎన్నో జీవుల కృషి ఫలితంగా సమకూర్చావు. ఆ జీవులన్నీ తమరే. మరి నీకు ఋణపడకుండా ఏమి చేసి ఋణ విముక్తుడనవ్వాలో అలా నడిపించు అని ఏమి తిన్నా తాగినా ప్రార్థిస్తుండు. దిల్ కే బాత్ గా వుండాలి దిమాక్ కే బాత్ గా వుండ రాదు.

సత్సంగం మన ఉన్నతి కొరకే. ఇతరులను బాగు చేసేందుకు కాదు అనే లోపల ఎరుకతో ఇతరులకు చెప్పడం తప్పు కాదు. ఆయన పంపిన వారికే చెబుతాము.

“వ్యామోహాల వల్ల నిర్దుష్టమైన ఆచరణ లేకుండా పోతుంది ?” అన్నావు.

ముందు ఆశయం గట్టిగా నిర్ణయించుకోవాలి. **లౌకికంగా లక్షలు గడించి అనుభవించడమా! లేక ఆత్మశాంతి, తృప్తి, ఆనందమా మనకు కావలసినది అనేది నిర్ణయించుకొని తక్కిన వ్యామోహాలన్నీ మన మార్గంలోని ముండ్ల కంపలని గుర్తించి దూరంగా (ఉండే) తొలగించుకుంటూ జాగ్రత్తగా పోవాలి**. దానినే వివేకము, వైరాగ్యము అన్నారు. **వివేక, వైరాగ్యాలే వ్యామోహాలను నిర్మూలిస్తాయి**. ఇక మార్గమే లేదు. **సాయి కృప చూపినా కాని, వివేక వైరాగ్యాలు లేకుంటే ఆ కృపను నిలుపుకోలేము. అందుకే మాస్టారు నీ జోలికి చిల్లి లేకుండా చూచుకో అన్నారు**. **అంటే మనలోని బలహీనతలను రూపు మాపుకో అన్నారు**.

“(నా) Professor ను motivate చేయడం నా సేవలో భాగం” అనుకోకు. అది నిష్కామ కర్మ – సాయినే మన చేత అలా చేయిస్తున్నాడు అనుకో. ఎప్పుడూ ఫలితం ఆశించకూడదు. బాబా ఇష్టం ఉంటే త్వరగా అవుతుంది. లేకుంటే మనం ఎంత ప్రయత్నించినా కాదు. **ప్రయత్నం – తీవ్ర ప్రయత్నం మాత్రమే మన ప్రధమ కర్తవ్యం అని సాగుతూ ఉండు.**

ఉదయప్రార్థన పొడుగు చేయవద్దు. శ్రీ మాస్టారు వ్రాసిన ప్రార్థన majority of people కొరకు. గట్టి పట్టుతో సాగే వారికి ఒకే ఒక్క మాట

చాలు. “**నిస్సహాయుడనై నీ పాదముల నాశ్రయించాను. నా సర్వ బాధ్యతలు నీవే ప్రభూ. మాయ నా దరి చేరకుండా మీరే చేయాలి. మా బహిరంతరముల యందున్న మిమ్ములను అనుక్షణం గుర్తించుచూ మీ ఆజ్ఞలను తు||చ|| తప్పకుండా పాటించేటట్లు నాకు శక్తి ప్రసాదించు ప్రభూ**” అని క్లుప్తంగా చెప్పుకో. హృదయపూర్వకంగా చెప్పు. **ఆ ప్రార్ధనలో నీ సాధనలో వచ్చే ఇబ్బందులు, doubtలు అన్నీ వారికి విన్నవించుకో. అది living ప్రార్థన.** అంతే కానీ ఉదయ ప్రార్థన అంతా stereo type లో చెప్పుకున్నందుకు లాభం ఏమిటి ? Paracetamol, Paracetamol అని ఎన్ని మార్లు అనుకున్నా జ్వరం తగ్గదు కదా!

జీవితలక్ష్యం ఏర్పరచుకోవటంలో పూర్వ జన్మ సాధన, ఈ జన్మలో పూర్వం చేసిన సాధన బాగా పని చేస్తాయి. సాయి సర్వ సమర్ధుడు – ఇది తిరుగులేని సత్యం – మనం ఒక్క అడుగు వేస్తే వారు పది అడుగులు మనవైపు వేస్తారు. ఒక్క అడుగు వేసే హక్కు మన కిచ్చారు. మనం ఎటు అడుగు వేస్తే అటు తాను 10 అడుగులు వేస్తారు. జీవిత లక్ష్యం ఎంచుకునే స్వేచ్ఛ మనకే ఇచ్చారు. **జీవిత లక్ష్యం సాధించేందుకు మన జీవిత విధానం సరి అయినదిగా ఉండాలి. ఆధ్యాత్మికత, ఆత్మానందం, తృప్తి, శాంతి అనేవి కావాలంటే మొదట మనం బానిసలుగా ఉండకూడదు.** 50 వేల రూపాయలు నెలకు జీతం. రాత్రి పగలు విద్యుక్త ధర్మ నిర్వహణలో తలమునకలు అవ్వటం. ఇలాంటి జీవితానికి డబ్బు ముఖ్యం, మన స్వేచ్ఛ అమ్ముకున్నాడు అన్నమాట. అందుకే మాస్టారు కలెక్టర్ పని బంగారు

సంకెళ్ళు అని బడి పంతులు అయ్యారు. వచ్చిన ఉద్యోగం వదిలేశారు. మన టైం మన సాధనకు ఉండాలి. మన మీద పెత్తనం చలాయించేవారు ఉండకూడదు. **అన్నానికి చేయి చాచకుండా ఉద్యోగం** మాత్రమే కాని మన Research తోనే ప్రజా క్షేమం ఉంది అనుకోకూడదు. ఈ Research లు అన్ని లేనప్పుడు ప్రజలు సుఖ శాంతులతో లేరా?? Research లు చేసి కొత్త కొత్తవి కనుక్కొని కొత్త జబ్బులు వచ్చాయి.

అసలు జీవిత ధ్యేయం – జీవిత లక్ష్యం ఏమిగా ఉండాలంటావు ?

నాకు తెలిసినంత వరకు మనలను ఈ విధంగా పుట్టించి పెంచి పోషించిన భగవంతుడు మన నుండి కోరేది ఏమిటి? మన కాలము, మనస్సు మాత్రమే!

మనస్సులో ఆలోచనలు రాకుండా సాధన చేసేందుకే కాలం ఇస్తున్నాము. ఈ సాధనకే మన లక్ష్యం పరిమితమై ఉండాలి. ఈ లక్ష్యం దృష్టిలో పెట్టుకొని job చూసుకోవాలి. Job చేస్తూ వ్యామోహాలకు గురి అయితే నిచ్చెన మీద నుండి క్రింద పడ్డట్లే! ఎవరో బాటకావు బచ్చా మారుతి కార్లలో తిరుగుతూ చాలా turn up చేస్తున్నట్లు కనపడితే అది మంచిదనుకోవటం వ్యామోహము.

ఒక కోనేటిలో ఒక రాయి వేస్తే దాని నుండి పుట్టిన అలలు కోనేరంత వ్యాపించినట్లు మనం ఒక చోట కూర్చొని ధ్యానం చేస్తే దాని ప్రభావం విశ్వమంతా ఉంటుంది అంటారు మాష్టారు. T.V. మెకానిజాలు వివరించగల మీకు నేను ఏమి చెప్పగలను?

ఆయన సర్వ సమర్ధుడు – సర్వ ప్రేరణాధికారి.

మనం ఒక్క అడుగు వేయడంలోనే మన ధర్మం ఉంది. ఆ తర్వాత వారు మనలను నడిపిస్తారు. ఆ ఒక్క అడుగు బాబా కోరినట్లు వేస్తామా! లేక MAJORITY OF MASS వేసినట్లు వేస్తామా అనేది COUNT అవుతుంది.

జీవితధ్యేయం ఏర్పరచుకొనడంలో అహంకారంతో కూడిన కర్తృత్వం ఉంటుందని తలచకూడదు. "బాబానే మనకు సరైన లక్ష్యం (ధ్యేయం) ఏర్పరచమని హృదయ పూర్వక ప్రార్థన" చేస్తే సరి.

బాహ్య పరిస్థితులను మనం మలచుకోవడం ఏమిటి? నేను sub inspector పనిలో చేరి బాహ్య పరిస్థితులను ఏమి మలుస్తాను? Nature of job selection లో చూచుకో. **నా మనస్సు, కాలము నీకు సమర్పించేటట్లు చేయమని బాబాను ప్రార్థిస్తే అన్నీ ఆయనే చూస్తారు**.

డబ్బు నిల్వచేయడ మనేది సాధకుని స్థితి ఏ మెట్టులో ఉంది అనే దాన్ని బట్టి ఉంటుంది. లౌకికులకు ఒక సూత్రం, గృహస్థులకు ఒక సూత్రం, సన్యాసులకు ఒక సూత్రం. మను ధర్మశాస్త్రం సంపాదించి చదువు. బాబా మీద ఉండే విశ్వాసాన్ని బట్టి ఎంత దాచి పెట్టాలి అనేది ఉంటుంది. బాబానే చెపుతారు కదా? నా లాంటి వారి సలహా ఎందుకు? సర్వజ్ఞులైన సాయిని, మాస్టారిని అడగాలి.

సదోపవాసం చేస్తున్నందుకు చాలా సంతోషం.

శ్రీ సత్యసాయి గారిని గురించి నీ భావన correct గానే ఉంది. శ్రీ మాష్టారు కూడా అలానే చెప్పేవారు. “నేను సాయిని అనే మాట ఒక్కటి తప్పితే మిగిలిన అన్నింటిలోను వారు మనకు మార్గదర్శకులు” అనేవారు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

మీ పె. సుబ్బరామయ్య.

ఇక్కడ మిలిటరీ స్వామి స్వర్గస్తులయ్యారు. సాయినాధుని భక్తులలో మహల్సాపతి, శ్రీ వెంకయ్య స్వామి వారి భక్తులలో పోలిరెడ్డి గారు దేహత్యాగం చేసినట్లు చేశారు. మార్చి 24వ తేది మద్రాసులో తన సొంత రూమ్ లో పదిమంది మిత్రుల ఎదుట వారు ధ్యానం చేస్తూ శరీరం వదిలారు. శ్రీ స్వామివారి కోసం వారు గొలగమూడిలో ఉండేవారు. Latrine, బాత్‌రూం లేదు. ఇంటి గోడలు 4 అడుగులు ఎత్తు. **ఈ కష్టాలన్నీ సంతోషంగా భరించాడు, గనుకనే వారికి ఉత్తమంగా శరీరం త్యజించే భాగ్యం కలిగింది.**

పె. సుబ్బరామయ్య.

*********** సద్గురు దేవా శరణం శరణం *********

20-12-1999 న సాయి శివకి: నిష్కామకర్మ ఎలా చేయాలో శ్రీ అనంతాచార్యుల వారి జీవితం చూసి నేర్చుకోవలసినవి

ఓం

గొలగమూడి

20-12-1999

డియర్ సాయిశివ,

శ్రీ అనంతాచార్యులుగారు ఎట్లా నిష్కామకర్మ చేశారో నేను చూడలేదు. కానీ ఒక్క విషయం సత్యం. వారు తన పేషెంట్లను ఇంత ఇస్తేనే వైద్యం చేస్తానని నేటి వైద్యులులాగ చెప్పేవారు కాదు. హుండీ పెడుతారు. వారివారికి భగవంతుడు బుద్ధి పుట్టించినది వేసిపోతారు. ఒక్క రూపాయి మందు తీసుకున్న వారు వంద రూపాయలు వేయవచ్చు, వంద రూపాయలు ఖరీదు గల మందు తీసుకున్నవారు ఒక్కరూపాయి వేయవచ్చు. **అసలు తనను తన పిల్లలను పోషించే దాత ఆ భగవంతుడు, గనుక ఆ భగవంతుడు తన చేత చేయించుకున్న వైద్యాన్ని క్షుణ్ణంగా చేయడమే తన కర్తవ్యంగా భావించి చేసారు.** ఆ రోజులలో సవరు బంగారు 50 రూ. అలాంటి సమయంలో రోజుకు 300రూ హుండీలో వచ్చాయంటే 6 సవర్ల బంగారం. అది ఈనాటి ధరను బట్టి 18,000 రూపాయలన్నమాట రోజు రాబడి.

ఇదంతా దాచుకోలేదు. సాయి వలె ఖర్చు చేసేవారు. తేనె, నెయ్యి, పాలు, పండ్లు, ఎండు ద్రాక్ష లాంటివి ఇంటి నిండా వచ్చేవట. అన్నీ పంచేసేవారట. తనకు, తన బిడ్డలకని దాచుకోకుండా అన్ని విషయాలకు భగవంతుని మీద ఆధారపడి జీవించారు అని మాష్టారు చెపితే మాకు తెలిసింది. ఈ విషయాన్ని శ్రీ కృష్ణమాచార్యుల శిష్యులు వ్రాసిన ఒక

గ్రంథంలో చదివాను. అలా నిష్కామ కర్మను త్రికరణ శుద్ధిగా ఆచరించబట్టే శ్రీ సాయినాధుడు వారికి 15 రోజులు పాటు భౌతిక దర్శనం ప్రసాదించారు.

"వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది" అక్షరాల పరమ సత్యం. ప్రతి ఒక్కరికి అన్ని కాలాలయందూ వర్తిస్తుంది. మనం ఫ్రెండ్స్ అనే భావంతో మనలను బురదలోకి దింపేవారితో స్నేహం చేయడం చాలా అవివేకము. మంచి సహవాస మయితే పది రూపాయలిచ్చి కొనుక్కో. చెడు సహవాసమయితే పది రూపాయలిచ్చి వదిలించుకోమని ఊరక చెప్పారా. విమర్శలు తగవని సాయి చెప్పినా మనం లెక్క చేయకుండా వింటుంటే ఆ మలినం మనకు చుట్టుకోకుండా పోతుందా? కనుక చాలా జాగ్రత్తగా ఉండాలి. అసలు లోకం ఎట్లా పోతే మనకేమి. మనం లోకాన్ని ఉద్ధరించగలమా**?** **మన కర్తవ్యం మనం చేసుకుపోతే చాలు**. వాదాలు, వంతులకు దూరంగా ఉండడం నేర్చుకోవాలి. ఒకటి రెండు మాటలే చెప్పాలి కానీ మన వాదాలు వంతులతో ఏమీ తెల్లవారదు.

"మైసూరు మహారాజు కనిపిస్తే ………………" నిజమే కదా! వారు పరమ దయామయులే. ఆ దయను మనం అందుకొని నిలుపుకునే స్థితిలో ఉండవద్దా. కరెంటు ఉంది, దాని నుండి వెలుగు పొందాలంటే వైరింగు, స్విచ్, బల్బు అన్నీ సరిగా ఉండవద్దా, అంతే. సాయి దయామయుడే – అందరినీ ఉపాసనీ బాబా లాగా తీసుకు వచ్చి ఎనిమిది రోజులు నడిచినా ఎనిమిది కిలోమీటర్లు నడవలేనట్లు చేసారా! **ఆధ్యాత్మికత అనేది ఇరుపక్షముల పొందికతో రావలసిందే కానీ, ఏక పక్షం కాదు. మనకు పుణ్యం సున్న అయినప్పుడు వారెంత ఇచ్చినా నిలుపుకోలేము……**

మాంసం పొందిన బ్రాహ్మణుడు దాన్ని నీటిలో పారేసినట్లు. మహాత్ముల దర్శనానికి పోయిన వారందరికీ ఒకే ఫలితమొస్తుందా? కొందరికి ఆ మహనీయుని చూడగానే సంతత ధారగా కన్నీరు కట్టలు తెంచుకుంటాయి. కొందరికి రోమాంచితము, కొందరికి ఇంకా కాస్త స్వీటు పెట్టకుండా ఉంచుకున్నారే అని, మరికొందరు ఈ సిగరెట్టు త్రాగే స్వామి దగ్గరకా మనం రావడం అని అనిపించడం లేదా? కరెంటు అక్కడ ఉంటే దానిని తీసుకునే శక్తి, ప్రకాశించే శక్తి బల్బుకు ఉండాలి. ఒకటి 80 volts మరొకటి 120 volts కనుకనే భగవద్గీత అంతా మన ప్రయత్నానికే ప్రాధాన్యం ఇచ్చింది. అలాగే యోగవాశిష్టం. **భగవంతుడు మనకు చదువుకునే ప్రాప్తమిచ్చి చదువుకోమంటే భగవంతుడు ఇచ్చిన ఆ పని మాని నిరంతరం భజన చేస్తానంటే ఆయన ఏమి చేస్తాడు. ఆయన సంకల్పాన్ని నెరవేర్చాలి. అది మన ముఖ్య కర్తవ్యం. అది పోతే అన్నీ పోయినట్లే. మహనీయులు మన అర్హతతో సంబంధం లేకుండానే అనుగ్రహిస్తారు. కానీ మనం మన అర్హత ఉన్నవరకే దానిని దక్కించుకుంటాము.**

"ఇంద్రియాణాంహి చరతాం యన్మనోను విధీయతే

తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంబసీ"

గాలిచేత పడవ యొక్క వేగం తగ్గిపోయినట్లు ఇంద్రియములలో చలించు మనసు యొక్క ప్రజ్ఞ హరించబడును అన్నారు.

ఆకలికి అన్నం కాని చిరుతిండి కాదు. చిరుతిండి జిహ్వాచాపల్యం వలన తింటాము. అది ఎంతమేరకు పోతే అంత లక్ష్యశుద్ధి కుదురుతుంది. మనలో జరిగే ప్రతీ భావస్పందనకూ కొంత శక్తి ఖర్చవుతుంది. చిరు తిండ్ల

వారికి శక్తంతా దానికే ఖర్చవుతుంది. ఇక లక్ష్యం కొరకు చేసేదేముంది. నిజంగా లక్ష్యశుద్ధి గలవారికి చిరుతిండ్ల విషయం గుర్తేరాదు.

మానవులకు (1) బ్రహ్మచర్యాశ్రమము (2) గృహస్థాశ్రమము (3) సన్యాసాశ్రమము (4) వానప్రస్థాశ్రమము (5) ఆశ్రమ ధర్మాలు లేని అతి ఆశ్రయము అని ఉన్నాయి.

భగవంతుడు మనలను ఏ ఆశ్రమంలో ఉంచితే ఆ ఆశ్రమ ధర్మాలు పాటించాలి.

బ్రహ్మచారులు – ఆంజనేయస్వామి వారిని ఆదర్శంగా తీసుకుని అష్టవిధ బ్రహ్మచర్యం వహించాలి. అంతే గాని గృహస్థు ధర్మాలు, వానప్రస్థ ధర్మాలు పాటించరాదు. **భగవంతుడు మన నుండి కోరిన విద్యా ప్రావీణ్యం గడించి భగవంతుని ఆ విద్యతో ఆరాధించాలి. అనంతాచార్యుల వలె అందరిలోని పరమాత్మను వారి వలె ఆరాధించాలంటే ముందు విద్యా ప్రావీణ్యం సంపాదించాలి. అన్యచింతలు లేకుండా విద్యాధ్యాసలో ఉంటే అన్నీ అవే వస్తాయి**. గృహస్థు గృహస్థుగా ఉండాలి.

భగవంతుడు నిర్దేశించిన పని ఆయనకు తృప్తికరంగా నిర్వహించాలి. పారాయణ, పూజలు చేస్తే మనం ముందుకు పోతామని కఠినంగా శరీరాన్ని కష్టపెట్టరాదు (ఆంధ్ర యోగులు అను గ్రంథంలో మాణిక్య ప్రభు శిష్యురాలు దిగంబర యోగిని చెపుతారు).

దీన్ని మాష్టరు గారు ఆచరించి చూపారు. తాను టిఫిన్ తినకుంటే అమ్మగారు తినరని నిత్యం ఇడ్లీ తినేవారు. మాష్టరు గారి ఉచ్ఛిష్టం అని

అమ్మగారు నిత్యం రెండు ఇడ్లీలు స్వీకరించేవారు. అంతేకానీ సాయిని మెప్పించాలని నిరాహారి కాలేదు. మనం కఠిన నియమాలు పెట్టుకొని శరీరం శుష్కింప చేసుకుంటే సాయి మెచ్చుకుంటారా? అతిగా తినవద్దన్నారు కాని నిరాహారులు కమ్మనలేదు. గృహస్థుగా తన విధి నిర్వహించాలి. అదీ సాయి మెచ్చుకునేటంతగా చేయాలి. గృహస్థ - సన్యాసి ధర్మాలు పాటిస్తానంటే సరిపోతుందా? ఇంట్లో అందరినీ భగవంతుని రూపాలుగా చూస్తాను, సేవిస్తాను అని నిత్యం ప్రమాణం చేయడమే “త్వమేవ మాతాచ పితాత్వమే....” అన్న ఆరతి పాటలోని అర్థం. అలా చేయాలి, సేవించాలి గాని పాట మాత్రం పాడి గృహనిర్వహణలో లోపం చేస్తానంటే సాయి ఏనాడైనా ప్రశ్నించరా? ఎదురుగా వచ్చి ప్రశ్నించకున్నా గాని ఆ లెక్క అలాగే ఉంటుంది బాకీ పడి.

నీవు చక్కగా చదువుకుని తల్లిదండ్రులను సుఖపెట్టాలి. తల్లిదండ్రుల రూపాలలో సాయి ఉన్నారని నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. నిత్యం పూజ, పారాయణ వీలైనంత వరకు చె య్యి. **నీవు చక్కగా చదవడం సాయికి చేసే పూజ అవుతుంది. అదే నిజమైన పూజ. అలా ఆర్జించిన విద్య ద్వారా అనంతాచార్యులు చేసినట్లు నిష్కామకర్మ చెయ్యి. ప్రతి విషయం మాష్టారు చక్కగా బోధిస్తారు. ఆయన వాణి విని చూడు.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ

మీ

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

<u>08-09-2005 న లక్ష్మక్క గారికి, సాయి కి: ఇంద్రియలోలత లేకుండా శరీర అవసరాలను తీరుస్తుండాలి.</u>

గొలగమూడి, 8-9-2005

పూజ్య గురుబంధువులైన శ్రీమతి లక్ష్మక్కగారికి, చి|| సాయికి శ్రీస్వామి వారి కృప సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం.

శ్రీ మాష్టరు గారు చెప్పిన మాటలు ఒక్కొక్కటి గుర్తించి వాటియొక్క అర్థం ఎంత లోతుగా గొప్పగా ఉందో మనసుకు అందే కొద్దీ వారిపై గౌరవభావం ఎంతగానో పెరుగుతుంది. నాకు ధ్యానం చేసే విధానం చెప్పండి అంటే దానితో ఇప్పుడు నీకేం పని అన్నారు. అదేంటి సార్ అందరికీ చెపుతున్నారు కదా అంటే వాళ్ళంతా గజస్నానం చేస్తారు నీవూ చేస్తావా? అన్నారు. గజ స్నానమంటే ఏనుగు స్నానమని వివరించారు. ఈ విషయాన్ని భగవద్గీత లో ఒక శ్లోకం వర్ణిస్తుంది .

రాగద్వేషవియుక్తైస్తు విషయానింద్రియైశ్చరన్|
ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి.||2-62శ్లో||

రాగము, ద్వేషము, అసూయ, మదమాత్సర్యంబులు ఆదిగా గల సర్వ అంతః శత్రువులు వదిలి, ఇంద్రియములు విషయముల వెంట పరుగిడకుండా ఉన్నప్పుడు ఆత్మజ్ఞానము కలిగి ప్రసాదము లభించును.

గనుక మనం ధ్యానం చేయడం ముఖ్యముకాదు. రాగ ద్వేషములు (లేకుండుటం), ఇంద్రియ నిగ్రహమే మన ధ్యేయము కావాలి.

రాగద్వేషములు లేక ఇంద్రియ నిగ్రహము గల్గినపుడు స్వతస్సిద్ధము గానే మనస్సు ధ్యానస్థమగును. మన ప్రయత్నమే ఉండదు. **జరిగే నాటకాన్ని మనం సాక్షిగా చూస్తుండటమే. నాటకంతో తాదాత్మ్యం చెంది రాగాద్వేషాల వలయంలో చిక్కరాదు**.

శరీరం అనే బండికి కావలసిన ఇంధనము సప్లై చేయకుండా ఉంటే శరీరము సరిగా పని చేయదు. దానివల్ల కొన్ని క్రొత్త సమస్యలు వస్తాయి. అందుకే ఆధ్యాత్మిక సాధన కత్తి మీద సాము అన్నారు. **ఇంద్రియలోలత లేకుండా శరీర అవసరాలను తీరుస్తుండాలి. ఏమరుపాటులేకుండా ఆ దివ్యపురుషుని స్మరణతో వారికి సమర్పించబడిన ప్రసాదాన్ని స్వీకరిస్తూ –ఋణానుబంధాలు, కర్తవ్యాలు తీరుస్తుంటే గట్టెక్కగలుగుతాము.**

శ్రీస్వామివారి ఆశీస్సులుండాలని ప్రార్థిస్తూ,

పె.సు.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

సార్ సత్సంగం

సంస్కారములను ఎలా తీసేసుకోవాలో సార్ చెప్పిన సూచనలు:

అతిక మామిడి ఆకు గుర్తుందా? అతిక మామిడాకు, నాసరజంగాకు రెండు ఒకటిగానే ఉంటాయి. కానీ అది వేరే, ఇది వేరే!

అతిక మామిడి ఆకు రూటు (వేరు) అలానే భూమి లోపలికి లోతుగా వెళ్ళిపోతుంది. నాసరజంగాకు లాగా పైకి ఉండదు. నాసరజంగాకు కూడా లోపలికి వెళ్తుంది కానీ దీనంత వెళ్లదు. అది, ఇది స్ప్రెడ్ (విస్తరించుకోవటంలో) అవ్వటంలో ఒకటే! ఏమి తేడా లేదు. ఆ భూమి బట్టి అలా ఉంటుంది కానీ స్ప్రెడ్ అవ్వటం అనేది ఇది కూడా వేళ్ళు పెట్టుకుంటూ అలా పోతానే ఉంటుంది. భూమిలో ఎక్కడ అవసరమనుకుంటే మెత్తగా చెమ్మగా ఉంది అంటే అక్కడ వేరు పెట్టేస్తుంది. రెండూ అలా స్ప్రెడ్ అవుతాయి కానీ వేళ్ళు మాత్రం అతికి మామిడికాయకి బాగా లోతుగా వెళుతుంది. పారతో చెక్కిస్తే నాసరజంగాకు లేతగా ఉండి పైకే వచ్చేస్తుంది. అదే అతికి మామిడి ఆకుకి కట్ అయిపోతుంది. మరలా అక్కడి నుంచే బయటకు వస్తుంది. మనలో ఉండే సంస్కారాలు కూడా అట్లాంటివి. పై లేయర్స్ లో ఉండి కొన్ని పోతాయి. కొంతమందిలో కొన్ని డీప్ రూటెడ్ గా ఉంటాయి. కొంతమందిలో డీప్ రూటెడ్ గా ఉండవు. ఏవి డీప్ రూటెడ్ ఉన్నాయి ఏవి డీప్ రూటెడ్ గా లేవు అనేవి మనకే తెలియదు. ఇవి ఒకతూరు కొట్టేస్తే పోవు. సంస్కారాలను కొట్టంగా కొట్టంగా కొట్టంగా మనకే తెలుస్తుంది. ఇది ఇన్ని మాటలు చెప్పినా వస్తుందే మొలక! అతిక మామిడాకు మరలా వస్తోంది, దీని అంతు చూడాలి అని చుట్టూరా త్రవ్వితే (త్రవ్వి అంటే పెద్ద గడ్డపారులు అవసరంలా) అంత గద్దదైన పుల్ల ఉంటే లోడి గట్టిగా పట్టుకొని లాగితే గాని రాదు. అట్లనే మన సంస్కారాలు తీవ్ర రూపంలో అంటిపెట్టుకొని ఉంటాయి. అవి ఊరికినే పామ్మంటే పోవు. పై

మాటలతో పోవు. ఆ సంస్కారాన్ని తీసేసుకోవలెను. మనిషి అంటే సంస్కారముల పుట్ట, సంస్కారముల పుట్ట. నాకీ సంస్కారము ఉంది అని గుర్తిస్తే అది ఒక మెట్టు. నాకుండేటటువంటి ఈ సంస్కారము చెడ్డది. ఇది నాకు ఉంది, దీన్ని నేను తొలగించుకోవాల. ఒక్కొక్కటి ఒక్కొక్కటి ఒక్కొక్కటి తొలగించుకున్న చాలు.

మహాత్ముల వాక్యాలు

నాకిష్టం లేనటువంటి పనులు చేసే వాళ్ళు, నన్ను తిట్టే వాళ్ళు, నా గురించి దుష్ప్రచారం చేసే వాళ్ళలో అవతరమూర్తులుగా దేవుడున్నాడని ధ్యానం చేయాలి. దానినే వాసుదేవ మంత్రం అంటారు. **- మాష్టర్ E. K.**

------- సద్గురు దేవా శరణం శరణం --------

సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ పాదుకలు